



నర్సాపూర్ రోడ్‌షోలో మాట్లాడుతున్న కేసీఆర్. చిత్రంలో మెదక్ ఎంపీ అభ్యర్థి వెంక్రటామిరెడ్డి, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, రాధాకృష్ణశర్మ, ఫరూక్ హుస్సేన్, హేమలత, ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు


నమస్తే తెలంగాణ

# సంగారెడ్డి

I | హైదరాబాద్, గురువారం 9 మే 2024 | SANGAREDDY

పటాన్‌చెరు రోడ్‌షోలో మాట్లాడుతున్న కేసీఆర్. చిత్రంలో మెదక్ ఎంపీ అభ్యర్థి వెంక్రటామిరెడ్డి, ఎమ్మెల్యేలు సునీతాలక్ష్మారెడ్డి, చింతా ప్రభాకర్, నాయకులు ఫరూక్ హుస్సేన్, గూడెం మధుసూదన్‌రెడ్డి



మెదక్ జిల్లా నర్సాపూర్‌లో నిర్వహించిన కేసీఆర్ రోడ్‌షోకు హాజరైన అశేషజనం

## కాంగ్రెస్ మెడలు వంచి కాల్వ పనులు
# పూర్తి చేసుకుందాం

### అవసరమైతే మనమంతా యుద్ధం చేద్దాం..

- మల్లన్నసాగర్ నీళ్లు పారితే నర్సాపూర్ బంగారు తునకవుతుంది..
- నర్సాపూర్ అభివృద్ధికి నేను నిధులిస్తే.. కాంగ్రెస్ సర్కారు రద్దు చేసింది
- హల్దీ, కూడవెల్లి వాగులపై చెక్‌డ్యామ్‌లు కట్టుకుని బ్రహ్మాండంగా పంటలు పండించుకున్నం..
- మదన్‌రెడ్డి ఎందుకు పోయినట్టు.. ముసలితనానికి కుసుమ గుడాలు
- మెదక్ ఎంపీగా వెంకట్రామిరెడ్డి అత్యధిక మెజార్టీతో గెలుస్తున్నాడు
- నర్సాపూర్ నియోజకవర్గం నుంచి 50 వేల మెజార్టీ ఇవ్వాలి
- నర్సాపూర్ రోడ్‌షోలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్
- గులాబీమయంగా నర్సాపూర్
- భారీగా తరలివచ్చిన ప్రజలు




సిద్దిపేట, మే 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): 'మల్లన్నసాగర్ నుంచి నర్సాపూర్‌కు వచ్చే కాల్వల పనులు మనకు ముఖ్యం. ఆ కాల్వ పనులు మన బతుకుదెరువు.ఈ కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచి నీళ్లు తేవాలంటే కచ్చితంగా ఎంపీగా వెంకట్రామిరెడ్డిని గెలిపించాలి. ఆయనతో పాటు మనమంతా యుద్ధం చేయడానికి సిద్ధంగా ఉండాలి'.. అని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపునిచ్చారు. బుధవారం రాత్రి మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలో కేసీఆర్ రోడ్‌షో కొనసాగింది. భారీగా జనం తరలివచ్చారు. ప్రజలనుద్దేశించి కేసీఆర్ మాట్లాడుతూ... కాల్వ పనులు పూర్తి చేసుకొని గోదావరి జలాలు పారించుకుని నర్సాపూర్ నియోజకవర్గాన్ని పచ్చగా చేసుకోవడం తన కల అని కేసీఆర్ పేర్కొన్నారు. నర్సాపూర్ మీద ఉండే ప్రేమతోని సునీతాలక్ష్మారెడ్డి గెలిచిన నాటి నుంచి ఆ కాల్వ పనులు స్పీడ్ పెంచి పని చేయిస్తున్నట్లు చెప్పారు. నర్సాపూర్ నియోజకవర్గానికి మల్లన్నసాగర్ నుంచి లింక్ కల్పించినట్లు చెప్పారు. లక్షా యాభై వేల ఎకరాలకు సాగునీరు అందాలని శంకరంపేట నుంచి కాల్వలు తవ్వుతున్నారని చెప్పారు. అవన్నీ మీ కండ్ల ముందు ఉన్నాయని, మల్లన్నసాగర్ నుంచి ఒక్కసారి నీళ్లు రావడం మొదలైతే నర్సాపూర్ బంగారు తునక అయితదని కేసీఆర్ ప్రజల హర్షధ్వానాల మధ్య చెప్పారు. ఆ పనిని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తదని నమ్మకం లేదన్నారు. ఆ పనులు పూర్తయి మల్లన్నసాగర్ నుంచి నర్సాపూర్‌కు గోదావరి నీళ్లు రావాలంటే మెదక్ ఎంపీగా వెంకట్రామిరెడ్డి భారీ మెజార్టీతో గెలవాలన్నారు. మనమంతా కలిసి యుద్ధం చేయాలని, లేకపోతే ఈ ప్రభుత్వం నీళ్లు ఇచ్చేలా లేదని కేసీఆర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని, ఇక కూడా నెరవేరుస్తదనే ఆశ కూడా లేదన్నారు.

### ముసలితనానికి (మదన్‌రెడ్డి) కుసుమ గుడాలు

ఈ ప్రాంత ప్రజలకు తన చరిత్ర, మదన్‌రెడ్డి చరిత్ర తెలుసని కేసీఆర్ అన్నారు. మదన్‌రెడ్డి టీడీపీలో ఉన్నప్పుడు ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి ప్రయత్నం చేసి ఓడిపోయిండన్నారు. ఆయనను రెండుసార్లు ఎమ్మెల్యేగా చేసింది తానే కదా అని కేసీఆర్ అన్నారు. 70 ఏండ్ల వయస్సులో ముసలితనానికి కుసుమ గుడాలు అన్నట్లు ఎవరిని ఉద్ధరిద్దామని పోయినట్టు మదన్ రెడ్డి.. ఏం చేద్దామని పోయినట్టు అని కేసీఆర్ ప్రశ్నించారు. ఇది ధర్మమేనా? మనందరినీ విడిచిపెట్టి పోయిన మదన్‌రెడ్డికి మీరే బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. శాసనసభ ఎన్నికల కంటే పెద్ద మెజార్టీ ఇచ్చి వెంకట్రామిరెడ్డిని గెలిపించాలన్నారు. భవిష్యత్తు మనదని, ఆలోచించి ఓటు వేయాలన్నారు. మనకు న్యాయం జరగాలన్నారు. నర్సాపూర్‌లో లంబాడ సోదరులు ఎక్కువ ఉన్నారన్నారు. తాను 50ఏండ్లు మొత్తుకుంటే ఏ ఒక్క ముఖ్యమంత్రి కూడా లంబాడీ తండాలను గ్రామ పంచాయతీలు చేయలేదన్నారు. గ్రామ పంచాయతీలు చేసింది తానే అని కేసీఆర్ గుర్తుచేశారు. నేరుగా గ్రామ పంచాయతీలకు నిధులు పంపించామన్నారు. గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్లు పెట్టామని చెప్పారు. పోడు భూములిచ్చామని... ఆ భూములకు రైతుబంధు ఇచ్చామన్నారు. కానీ, ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో పోడు భూములకు రైతుబంధు రాలేదన్నారు. సమాజంలో ఏ ఒక్క వర్గం గురించి కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచన చేయడం లేదన్నారు. బీఆర్ఎస్ ఎంపీలు గెలిస్తే ఢిల్లీలో మన హక్కుల గురించి పోరాడుతారన్నారు. తెలంగాణ మొత్తంలో అతి ఎక్కువ మెజార్టీతో మీ అందరి దీవెనతో మెదక్ ఎంపీగా వెంకట్రామిరెడ్డి గెలుస్తున్నాడని కేసీఆర్ చెప్పారు. నర్సాపూర్ నియోజకవర్గం నుంచి కనీసం 40నుంచి 50వేల మెజార్టీ ఇవ్వాలని కోరారు. నర్సాపూర్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రోడ్‌షో గ్రాండ్ సక్సెస్ అయ్యింది. పట్టణం గులాబీమయంగా మారింది. భారీగా జనం తరలివచ్చారు.

### కాంగ్రెస్ సర్కారు నిధులు రద్దు చేసింది

నర్సాపూర్‌ను ఎన్ని రకాలుగా అభివృద్ధి చేశానో మీ అందరికీ తెలుసని కేసీఆర్ చెప్పారు. నర్సాపూర్ మున్సిపాలిటీ అభివృద్ధికి రూ. 25 కోట్లు మంజూరు చేస్తే వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తే వాటిని వెనక్కి తీసుకుపోయిందన్నారు. కొల్చారం మండలంలో మల్లినాథ సూరి పేరు మీద యూనివర్సిటీ పెడుదామని అనుకున్నామని, ఈ కాంగ్రెస్ ప్రభుత్వం చేసే పరిస్థితి లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంజూరు చేసిన నిధులను రద్దు చేయడమే తప్పా మరోటి ఈ ప్రభుత్వం చేయడం లేదన్నారు.ఇక ముందు కూడా ఈ ప్రాంత అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు ఇచ్చేలా లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంజీరా, హల్దీ వాగుల మీద ఎన్ని చెక్‌డ్యామ్‌లు కట్టించానో మీ అందరికీ తెలుసని, దాదాపుగా 10 చెక్ డ్యామ్‌లు కట్టించినట్లు కేసీఆర్ గుర్తుచేశారు. ఈ చెక్ డ్యామ్‌లతోని పంటలు బాగా పండించుకున్నామన్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని దెబ్బతీసే పరిస్థితి వస్తా ఉందన్నారు. తాగునీరు, సాగునీరు ఇబ్బందులు మోపయ్యాయని, కరెంట్ సరిగ్గా రావడం లేదన్నారు. పేదలకు సంక్షేమం లేదని, ఈ ప్రభుత్వ హయాంలో ఏ ఒక్క హామీ అమలు అవుతుందన్న నమ్మకం లేదని కేసీఆర్ అన్నారు.



## రేవంత్ సర్కారు నిర్వాకంతో
# పరిశ్రమలు పోతున్నాయి

### పటాన్‌చెరులో భూముల ధరలు తగ్గుతున్నాయి

- రేవంత్ సర్కార్ వల్లే రియల్ ఎస్టేట్ కుప్పకూలింది
- పర్మిషన్ల కోసం రేవంత్ స్కేర్‌ఫీట్‌కు రూ.75 అడుగుతుండు
- పటాన్‌చెరులో పోలీసులు అతి చేస్తున్నారు
- పోలీసులు ఖబడ్దార్.. వచ్చేది మా ప్రభుత్వమే
- నా ప్రాణం ఉన్నంత వరకు తెలంగాణకు అన్యాయం జరగనివ్వను
- వెంకట్రామిరెడ్డి మంచి మనిషి.. ఆయనను ఎంపీగా గెలిపించాలి..
- పటాన్‌చెరు రోడ్‌షోలో గులాబీ బాస్ కేసీఆర్

### వెంకట్రామిరెడ్డిని గెలిపిస్తే మంచి జరుగుతుంది: కేసీఆర్

ప్రజల కష్టాలు తీరాలన్నా, పటాన్‌చెరు రైల్వేకోచ్ ఫ్యాక్టరీ, ఇతర పరిశ్రమలు తరలివెళ్లవద్దన్నా ఎంపీ ఎన్నికల్లో వెంకట్రామిరెడ్డిని గెలిపించాలని ఓటర్లను కేసీఆర్ కోరారు. పటాన్‌చెరు ప్రాంతంలో పోలీసులు అతిగా ప్రవరిస్తున్నారని కేసీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రేపు వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమని, పోలీసులు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. మేము లాఠీలు, జైళ్లకు భయపడితే తెలంగాణ వచ్చేది కాదన్నారు. పోలీసులు అతికి పోవద్దని, రాజకీయాలు చేయవద్దని, డ్యూటీలు జాగ్రత్తగా చేసుకోవాలని కేసీఆర్ సూచించారు. మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి రిటైర్డు ఐఏఎస్ అధికారి అని, ఈ ప్రాంతానికి మేలు చేయాలని కోరుకుంటున్నాడని తెలిపారు. రూ.100 కోట్లతో ట్రస్టు ఏర్పాటు చేసి పేదలకు విద్యను అందజేయాలని ఆలోచిస్తున్నారని తెలిపారు. అలాంటి వ్యక్తిని ఎంపీగా గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు మహిపాల్‌రెడ్డి, చింతా ప్రభాకర్, సునీతారెడ్డి, మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, రాష్ట్ర నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, కర్నె ప్రభాకర్, గూడెం మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

సంగారెడ్డి, మే 8(నమస్తే తెలంగాణ) : రేవంత్‌రెడ్డి సర్కార్ వల్లే పటాన్‌చెరు ప్రాంతంలో రియల్ ఎస్టేట్ కుప్పకూలిందని, పరిశ్రమలు తరలిపోతున్నాయని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. బుధవారం రాత్రి పటాన్‌చెరులో కేసీఆర్ రోడ్‌షో చేపట్టారు. బుధవారం రాత్రి పటాన్‌చెరు అంబేద్కర్ సర్కిల్ వద్ద జరిగిన రోడ్‌షోలో కేసీఆర్ ప్రసంగిస్తూ రేవంత్ సర్కార్‌పై నిప్పులు చెరిగారు. రేవంత్ ప్రభుత్వం కారణంగా పటాన్‌చెరులో రియల్ ఎస్టేట్ కుప్పకూలిందని, భూముల ధరలు తగ్గాయన్నారు. పటాన్‌చెరు, కొల్లూరు ప్రాంతంలో అపార్టుమెంట్ల నిర్మాణం కోసం రేవంత్ రెడ్డి అనుమతులు ఇవ్వకుండా రియల్ ఎస్టేట్ రంగాన్ని ప్రమాదంలోకి నెడుతున్నారని ఆరోపించారు. పర్మిషన్ల కోసం రేవంత్‌రెడ్డి స్కేర్ ఫీట్‌కు రూ.75 డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. కరెంటు కోతలతో పరిశ్రమలు తరలిపోతున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిన టీఎస్ఐపాస్ వల్ల పటాన్‌చెరు ప్రాంతంలో పెద్ద ఎత్తున పరిశ్రమలు ఏర్పాటైనట్లు తెలిపారు. నిరంతరం కరెంటు సరఫరా చేయడంతో పారిశ్రామికవేత్తలు సంగారెడ్డి జిల్లాలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చారని తెలిపారు. కానీ, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో కరెంటు కోతల కారణంగా పరిశ్రమలు తరలివెళ్తున్నట్లు చెప్పారు. పటాన్‌చెరులోని ప్రముఖ కళ్ల అద్దాల తయారీ పరిశ్రమ సైతం కరెంటు కోతల కారణంగా ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. పటాన్‌చెరులో గతంలో కలుషిత జలాలు ఉండేవన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ శుద్ధి తాగునీరు సరఫరా చేశామన్నారు. ఇప్పుడు పటాన్‌చెరులో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నట్లు కేసీఆర్ చెప్పారు. ఇండియాలో ఎక్కడి లేనివిధంగా పేదల కోసం తాము కొల్లూరులో 16500 ఇండ్లు నిర్మించి పంపిణీ చేశామన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం పట్టించుకోవడం లేదన్నారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసగిస్తున్నట్లు కేసీఆర్ తెలిపారు.



బుధవారం రాత్రి పటాన్‌చెరులో కేసీఆర్ రోడ్ షోకు భారీగా హాజరైన జనం